# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తి ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 140 మంగళవారం 18 జులై 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## వరదల నుంచి ఢిల్లీని కాపాడండి

**న్యూఢిల్లీ:**

ఢిల్లీలో వరదలకు ఆప్ సర్కారు ఇతర రాష్ట్రాలను నిందించడం మానేసి.. సమస్యను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ ఎద్దేవా చేశారు. అస్సాంలో తరచూ వరదలు వస్తాయని తామెప్పుడూ ఎవరినీ నిందించలేదని చెప్పుకొచ్చారు. చైనా, భూటాన్ నుంచి వచ్చే నీటి ప్రవాహం వల్ల అస్సాంలో వరదల పరిస్థితులకు తాము వారిని నిందించకుండా.. శాస్త్రీయ ప్రతిస్పందనను ఏర్పాటు చేసినట్లు సూచించారు. హత్నికుండ్ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడం ద్వారా దేశ రాజధానిని వరద సంక్షోభంలోకి నెట్టేందుకు కేంద్ర సర్కారు, బీజేపీ నాయకత్వంలోని హర్యానా ప్రభుత్వం కుట్ర పన్నుతున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఇతర రాష్ట్రాలకు ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ కు వెళ్లే హత్నికుండ్ బ్యారేజీ తూర్పు కాల్వలకు నీటిని విడుదల చేయకపోవడంపై

02

## ఇండియన్ రెడ్‌క్రాస్ మరింత విస్తరించాలి

### డా.మన్‌సుఖ్ మాండవీయ

**న్యూఢిల్లీ:**

రాష్ట్రపతి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము అధ్యక్షతన, రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. 9 రాష్ట్రాలు, యురీటీల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు ఏజీఎంలో పాల్గొన్నారు. మరికొందరు వర్చువల్ మార్గంలో పాల్గొన్నారు. ఐఆర్‌సీఎస్ గౌరవ ఛైర్మన్ డా.మన్‌సుఖ్ మాండవీయ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొవిడ్-19 మహమ్మారి కారణంగా, ఆరు సంవత్సరాల తర్వాత ఈ సమావేశం భౌతికంగా జరిగింది. దేశం నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆవిర్భవించింది పేదలకు, బలహీన వర్గాలకు సేవ చేయడానికేనని ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ మాండవీయ చెప్పారు. "భారత సరిహద్దులు దాటి సహాయ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఇండియన్ రెడ్‌క్రాస్ మరింత విస్తరించాలి" అని ఆకాంక్షించారు.

సంస్థ కార్యక్రమాల్లో మరింత సమర్థత & పారదర్శకత కోసం, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర శాఖలు తమ నెలవారీ నివేదికలను పీపీటీ రూపంలో తమ రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించాలని కేంద్ర ఆరోగ్య మంత్రి సూచించారు. తద్వారా, రెడ్‌క్రాస్ మరింత వ్యాప్తి చెందుతుంది, ఎక్కువ మందికి చేరువ అవుతుందని చెప్పారు. కార్పొరేట్

02




## ఎంబీబీఎస్ అడ్మిషన్ల షెడ్యూల్ 2023

**న్యూఢిల్లీ, జూలై 17:**

దేశవ్యాప్తంగా 2023-24 విద్యాసంవత్సరానికి వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ఆలిండియా కోటా సీట్ల భర్తీకి ఎమ్‌సీసీ షెడ్యూలు విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం జులై 20వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. నీట్ యూజీ-2023లో ర్యాంక్ పొందిన విద్యార్థులకు ఈ కౌన్సెలింగ్ ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. కౌన్సెలింగ్ నాలుగు విడతలుగా జరుగుతుంది. మొత్తం



సీట్లలో 15 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు.తొలి విడత జులై 27, 28 తేదీల్లో జరుగుతుంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జులై 20 నుంచి 25వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు చేసుకోవాలి. తొలి విడత

02

## అంజూయాదవ్‌పై చర్యలు తీసుకోండి

**శ్రీకాళహస్తి సీఐపై ఎస్పీకి పవన్ ఫిర్యాదు..**

**తిరుపతి**

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సోమవారం తిరుపతి చేరుకున్నారు. శ్రీకాళహస్తి సీఐ అంజూయాదవ్‌పై తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి ఆయన ఫిర్యాదు చేశారు..తొలుత గన్నవరం విమానాశ్రయం నుంచి రేణిగుంట చేరుకున్న ఆయన.. అక్కడి నుంచి తిరుపతికి వచ్చారు. జనసేన కార్యకర్తలతో కలిసి భారీగా ర్యాలీగా ఎస్పీ



02

## శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం



02

**- వార్షిక లెక్కలు ప్రారంభించిన రోజు**

**టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి**

**- శ్రీరంగం నుండి శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ**

**తిరుమల**

తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం సాలకట్ల ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈవో ఎ.వి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఉదయం 7 నుండి 9 గంటల వరకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి వారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేశారు. మరో పీఠంపై

## 2600కి పైగా విమానాలు రద్దు

**8 వేల విమానాలు ఆలస్యం..**

**న్యూయార్క్, జూలై 17:**

ఓవైపు భారీ వర్షాలు, మరోవైపు పిడుగుల హెచ్చరికలతో ఏకంగా వేలలో విమానాలు రద్దు చేయాల్సిన పరిస్థితి అగ్ర రాజ్యానికి వచ్చింది.. అమెరికాలో ఉరుములు, మెరుపులతో కూడా భారీ వర్షం కురుస్తోంది. పిడుగులు కూడా పడుతున్నాయి.. దీంతో.. అమెరికా వ్యాప్తంగా 2,600 విమానాలు రద్దు చేశారు అధికారులు.. మరో 8 వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. వీటిలో చాలా వరకు రద్దు చేయబడిన, ఆలస్యం అయిన విమానాలు ఈశాన్య ప్రాంతానికి చెందినవి. ఈశాన్య ప్రాంతం నుండి 1,320 విమానాలు సహా దేశవ్యాప్తంగా మొత్తం 2,600 విమానాలు రద్దు చేయబడ్డాయి. వాటిలో 350 విమానాలు న్యూజెర్సీ రాష్ట్రంలోని నెవార్క్



లిబర్టీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిలిచిపోయాయి. అయితే, ఈ వర్షం ప్రభావం ముఖ్యంగా జాన్ ఎఫ్ కెన్నెడీ మరియు లా గార్డియన్ విమానాశ్రయాలలో ఎక్కువగా ఉంటుంది.అమెరికా ఈశ్రీతిణష్ట్రబింలిజీతీవ డేటా ప్రకారం,జాన్ ఫిట్జ్‌గెరాల్డ్ కెన్నెడీ విమానాశ్రయంలో 318 విమానాలు పూర్తిగా రద్దు చేయబడ్డాయి. మరో 426 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. లాగ్వార్డియా విమానాశ్రయంలో 270 విమానాలు రద్దు చేయబడ్డాయి. మరో 292 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

02



## ఎక్కడికి రమ్మంటావ్ కేటీఆర్..?:

**హైదరాబాద్ జూలై 17**

'ఉచిత విద్యుత్‌ను, ప్రజల సెంటిమెంట్‌ను స్వార్థం కోసం కేసీఆర్ వాడుకోకూడదని తానా వేదికగా నేను స్పష్టంగా చెప్పాను. దాన్ని తప్పుడు ప్రచారం చేసి రాద్ధాంతం చేస్తున్నారు. ఉచిత కరెంట్ అనేది పేటెంట్ కాంగ్రెస్‌ది అయితే.. అసలు కాంగ్రెస్సే కరెంట్ ఇవ్వలేదన్నట్లుగా మాట్లాడి.. కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్లుగా ఇలా కేటీఆర్ ఒకటే గంతులేస్తున్నారు. మూడు గంటలు కావాలా..

02

# గుంటూరు జిల్లాల్లో వారు ఇటూ...వీరు అటూ

**గుంటూరు, జూలై 17:**

ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాలలో కీలక పరిణామాలు చోటు చేసుకోన్నున్నట్లుగా కనిపిస్తోంది. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ నుంచి ప్రముఖ నాయకులు గేటు దూకనున్నారని పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ నడుస్తుంది. ఎంపీగా ఉన్నా తనకు ప్రాధాన్యం లేదని ఒకరు భావిస్తుంటే.. జిల్లాలో కీలక నాయకుడిగా ఉన్న తన మాటకు అధిష్ఠానం కనీస విలువ ఇవ్వడం లేదని ఓ కురువృద్ధ నేత భావిస్తున్నారట!నర్సారావుపేట పార్లమెంటు నియోజకవర్గం నుంచి లావు శ్రీకృష్ణ దేవరాయలు 2019 ఎన్నికలలో విజయం సాధించారు. పార్టీ ఆరంభం నుంచి దేవరాయలు పార్టీతోనే ఉన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధిపతిగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు పరిచయం. నర్సారావుపేట ఎంపీగా ఎన్నిక అయిన తర్వాత పార్టీలో లుకలుకలుకలతో ఇబ్బందులకు గురౌతున్నారు దేవరాయలు. చిలకలూరిపేట నియోజకవర్గం నర్సారావుపేట పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రొటోకల్ మర్యాదలు కూడా దక్కటం లేదట. ఆ నియోజవర్గ ఎమ్మెల్యే విడదల రజనీకి, ఎంపీకి మద్య గ్యాప్ అంతకతకూ పెరుగుతుంది. తన పర్మిషన్ లేకుండా తన నియోజకవర్గంలోకి ఎంపీ ఎలావస్తారని అనేక సార్లు రోడ్డెక్కిన పరిస్థితులు ఉన్నాయిలావు కృష్ణ దేవరాయలు ఊహించింది ఒకటి జరుగుతుంది మరొకటి. గత టీడీపీ ప్రభుత్వంలో నారాయణ విద్యాసంస్థల అధిపతి నారాయణకు ఇచ్చినంత ప్రాధాన్యం వైసీపీ ప్రభుత్వంలో దక్కుతుందని భావించి భంగపడ్డారు దేవరాయలు. ఎంపీ కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని భావిస్తున్నారట. మెడికల్ కాలేజ్ పర్మిషన్ కోసం కూడా ప్రయత్నించి భంగపడ్డారట. తన మాటకు పార్టీలో విలువ లేకపోవడం తీవ్రంగా బాధిస్తుందట. ఈ నేపథ్యంలో ఆయన టీడీపీలోకి వెళతారన్న వార్తలు లోకల్ గా హల్ చల్ చేస్తున్నాయి.ఇప్పటికే టీడీపీ అధిష్ఠానంతో టచ్ లో ఎంపీ ఉన్నారన్న వార్తలు ఊపందుకున్నాయి. గుంటూరు ఎంపీగా టీడీపీ నుంచి రెండోసారీ విజయం సాధించిన గల్లా జయదేవ్ సైలెంట్ అయ్యారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. పార్టీకూడా జయదేవ్ స్థానంలో మరో అభ్యర్థి కోసం చూస్తుందట. గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కమ్మ కులానికి చెందిన వారైతే విజయం తథ్యమని టీడీపీ భావిస్తుంది. కులం కూడా తోడవటంతో వైసీపీ నుంచి టీడీపీలోకి లావు దేవరాయలు జంప్ అవుతున్నారని, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేయబోతున్నరన్న టాక్ అయితే వినపడుతోందిటీడీపీ నర్సారావుపేట ఎంపీగా పోటీ చేసి లావు కృష్ణ దేవరాయలు చేతిలో రాయపాటి సాంబశివరావు ఓడిపోయారు. 2014, 2019 రెండు సార్లు నర్సారావుపేట పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసి ?డిపోయారు రాయపాటి. కాంగ్రెస్ పార్టీ లో జిల్లాను శాసించిన వ్యక్తి రాయపాటి. ఎంతో మందికి రాజకీయ బిక్ష పెట్టిన చరిత్ర ఆయనది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 2014లో టీడీపీలో జాయిన్ అయిన నుంచి పెద్దగా ప్రాధాన్యం లేకుండా పోయింది రెండు సార్లు పోటీ చేసి ?డిపోవడం ఒక కారణం అయితే.. వయోభరం, కొత్త తరం రాజకీయం మరో కారణం. తన బద్ద శత్రువు కన్నా లక్ష్మీనారాయణ టీడీపీలోకి రావడం.. జిల్లా నాయకులంతా అయనతో టచ్ లోకి వెళడంతో అసలు ప్రాధాన్యం లేకుండా పోయిందని రాయపాటి భావిస్తున్నారట.తనకు ఎంపీ సీటు, తన కుమారుడు, కోడలకి ఎంఎల్ఏ సీటు ఇవ్వాలని చంద్రబాబును కోరారు. అయితే పరిగణనలోకి కూడా తీసుకోకపోవడం అవమానంగా భావిస్తున్నారట. వైసీపీలోకి వెళ్ళేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారట. వైసీపీ అధిష్ఠానం వరకు తన విన్నపాన్ని పంపారట. మరి ఏమి జరుగుతుందో చూడాలి. ఒకే పార్లమెంటు నియోజకవర్గం ప్రత్యర్థులుగా పోటీ చేసిన అ ఇద్దరూ కుండ మార్పిడి లాగా సొంత పార్టీని వీడి ప్రత్యర్థి పార్టీలోకి చేరేందుకు ప్రయత్నించడం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రాజకీయంగా ఆదరణ కోల్పోయిన రాజకీయ భీష్ముడు రాయపాటి సాంబశివరావు వైసీపీలోకి.. యువ ఎంపీ వైసీపీ నుంచి టీడీపీ లోకి వస్తున్నారన్న వార్తలు మాత్రం ఉమ్మడి గుంటూరు జిల్లాలో సందడి చేస్తున్నాయి.

# 108 అడుగుల శ్రీరాముడి విగ్రహం

**కర్నూలు, జూలై 17:**



కర్నూలు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దేవాలయానికి నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారు. ఆధ్యాత్మిక కేంద్రంగా పిలువబడే మంత్రాలయం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. ఈ క్షేత్రంలో ఎప్పటి కప్పుడు కొత్త కొత్త హంగులతో అభివృద్ధి చేస్తూ స్వామి వారికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు.అంతే కాకుండా స్వామి వారికీ గజవాహన, పల్లకి వంటి రకరకాల సేవలతో స్వామి వారికీ పూజలు చేస్తుంటారు. ఒకవైపు ఆధ్యాత్మిక కేంద్రంగా మరో వైపు పర్యటక కేంద్రంగా విరాజిల్లుతున్న మంత్రాలయం క్షేత్రంలో మరో విశిష్టత చేరబోతుంది. మంత్రాలయం ఆలయం సమీపంలో 10 ఎకరాల విస్తీరణంలో 108 అడుగుల శ్రీరాముడి విగ్రహం ఏర్పాటు కానుంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న ఈ విగ్రహం కోసం దాదాపుగా 250 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు.కర్నూలు జిల్లాలో వేదభూమి అయిన రాఘవేంద్ర స్వామి కొలువై ఉన్న మఠం మంత్రాలయం ఒకవైపు ఆధ్యాత్మిక కేంద్రంగా, మరో వైపు పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న మంత్రాలయం క్షేత్రంలో 108 అడుగుల ఎత్తయిన శ్రీరాముడి కాంస్య విగ్రహం ఏర్పాటు కానుంది. శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి ఆధ్వర్యంలో జై శ్రీరామ ఫౌండేషన్ దీనికోసం చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రాలయంలో ఎమ్మిగనూరు రోడ్డు వైపున ఉన్న మఠానికి చెందిన 10 ఎకరాల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే మంత్రాలయంలో శ్రీరాముడి నమూనా విగ్రహాన్ని ప్రతిష్టించి చండీయాగం చేశారు. విగ్రహం, ఆలయ నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈ నెల 18న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ వర్చువల్గా ప్రారంభించేందుకు అంగీకరించినట్లు జై శ్రీరామ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎంపీ శ్రీధర్, కె. రాములు తెలిపారు.మొత్తం రూ.250 కోట్లతో కాంస్య విగ్రహం, చుట్టూ తొమ్మిది ఆలయాలను నిర్మించనున్నట్లు చెప్పారు. కాంస్య విగ్రహాన్ని ఢిల్లీలో తయారు చేస్తున్నారని, అది పూర్తి కావడానికి మరో ఎనిమిది నెలలు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# పురాతన ఆలయాల పునరుద్ధరణకు టీటీడీ...

**తిరుమల, జూలై 17:**



తిరుమల తిరుపతి దేవస్థానం నిధుల సహకారంతో ఆంధ్రప్రదేశ్ లోని ఆరు పురాతన ఆలయాలు పూర్తి స్థాయిలో రూపుదిద్దుకోనున్నాయి. ప్రపంచంలోనే అత్యంత ధనిక హిందూ దేవాలయాల ట్రస్ట్‌గా గుర్తింపు పొందిన టీటీడీ తన శ్రీవాణి ట్రస్టుకు వందల కోట్ల రూపాయల విరాళాలు అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఆలయాల నిర్మాణాలను చేపట్టేందుకు భక్తుల నుంచి విరాళాలు సేకరించడంతోపాటు పురాతన ఆలయాలకు కూడా ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో టీటీడీ "శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణం" (శ్రీవాణి) ట్రస్టును కొన్ని సంవత్సరాల క్రితం ప్రారంభించింది.

అనంతపురం జిల్లా రాయదుర్గంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.2.65 కోట్లు, వైఎస్ఆర్ జిల్లా రంగసముద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయానికి రూ.1.5 కోట్లు, నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రూ.1.85 కోట్లు, నంద్యాల జిల్లా సంజామల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం రూ.2.21 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం రూ.2.4 కోట్లు, శ్రీ బాల వెంకటేశ్వర స్వామి ఆలయం రూ. కాకినాడ పట్టణానికి కోటి రూపాయలను నిధులను కేటాయించింది. శ్రీవాణి ట్రస్ట్ ప్రారంభమైనప్పటి నుంచి మే నెల వరకు 861 కోట్లను భక్తులు విరాళాలుగా సమర్పించగా, 602 కోట్ల 60 లక్షలు వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లు చేసినట్లు ఆలయ ఈఓ ధర్మారెడ్డి వెల్లడించారు. కరెంటు అకౌంట్‌లో 139 కోట్ల నిధులు ఉన్నాయని, 120.24 కోట్లని వివిధ కార్యక్రమాలకు ఖర్చు చేయగా, శ్రీవాణి ట్రస్టు నిధుల డిపాజిట్లు ద్వారా 36.50 కోట్ల రూపాయల వడ్డీ వచ్చిందని టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి చెప్పారు. 2019 సెప్టెంబర్ 23వ తేదీ నుంచి శ్రీవాణి ట్రస్ట్ కీ విరాళాలు సమర్పించిన భక్తులకీ వీఐపీ బ్రేక్ దర్శనం కల్పిస్తున్నామని, శ్రీవాణి ట్రస్టుకీ రూ 500, 300లకు భక్తులకీ రసీదు ఇవ్వడమనేది అవాస్తవమని వెల్లడించారు. అలాగే శ్రీవాణి ట్రస్టుకీ విరాళాలు ఇచ్చిన భక్తులకి రాజ్య మార్గం ద్వారా స్వామి వారి దర్శనం కల్పిస్తున్నామన్నారు.శ్రీవాణి ట్రస్టు ద్వారా విరాళాలు, నిధుల సేకరణ కార్యక్రమాలకు సంబంధించి పూర్తిగా పారదర్శకత పాటిస్తున్నట్లు చెప్పారు. శ్రీవాణి ట్రస్టు ప్రారంభించిన తర్వాత దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపి, మొదటి ఆరు నెలల్లోనే ప్రక్షాలన చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 70 మంది దళారులను అరెస్ట్ చేసి, 214 కేసులు నమోదు చేశామన్నారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టిక్కెట్లను కొనుగోలు చేసిన ప్రతి ఒక్క భక్తుడికి రసీదులు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 8 లక్షల మందికీపైగా భక్తులు శ్రీవాణి ట్రస్టు ద్వారా స్వామి వారిని దర్శించుకోగా ఎవరూ ఆరోపణలు చేయలేదన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా దర్శనానికి వెళ్తే.. రసీదులు ఇవ్వలేదంటూ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ టీటీడీపై ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఆయన ఎప్పుడు దర్శనానికి వచ్చారో చెబితే పరిశీలించి తాము రసీదులు ఇస్తామన్నారు.

# పల్నాడు జిల్లాల్లో వజ్రాలు

**గుంటూరు, జూలై 17 :**

పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వజ్రాలు దొరుకుతున్నాయంటూ ప్రచారం జరుగుతోంది. దీంతో జనాలు భారీ సంఖ్యలో అక్కడికి క్యూ కట్టి.. వెతుకులాట ప్రారంభించారు. పిడుగురాళ్ల రోడ్డు శివారు ప్రాంతమైన బసవమ్మ వాగు దగ్గర రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు.. అక్కడ రోడ్ల కోసం బెల్లంకొండ నుండి తెచ్చిన ఎర్రమట్టిని పోశారు. ఈ విషయం తెలిసిన కొందరు వజ్రాలు, రంగు రాళ్లు దొరుకుతాయేమోనని వేట మొదలుపెట్టారు. వర్షం పడితే చాలు గుంపులు, గుంపులుగా వెళ్లి రోజంతా అక్కడే ఉండి రాళ్ల కోసం కోసం వెతుకుతున్నారు.ఈ విషయం తెలియడంతో సత్తెనపల్లితో పాటుగా చుట్టుపక్కల ఉన్న నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, వినుకొండ ప్రాంతాల నుంచి కూడా వాహనాలలో జనాలు అక్కడికి వచ్చి.. ఒకటి దొరికినా చాలని వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. గతంలో బెల్లంకొండ మండలం కోళ్లూరులో వజ్రాలు దొరికాయనే ప్రచారం ఉంది. అక్కడ కూలీలను పెట్టి మరీ వజ్రాల కోసం గాలించారట.. ఆ ప్రాంతం నుంచి తెచ్చిన మట్టి కావడంతోనే ఇలా గాలిస్తున్నారు. అందులో పక్కాగా వజ్రాలు, రంగు రాళ్లు ఉంటాయని నమ్ముతున్నారుఅంతేకాదు వజ్రాల టెస్టింగ్ మెషిన్‌లతో బంగారు వర్తక వ్యాపారుల దర్శనమిస్తున్నారట.. బంగారు వ్యాపారులు టెస్టింగ్ మెషీన్‌లతో వ్యాపారం ప్రారంభించారట. టెస్టింగ్‌కు రూ.100 తీసుకుంటున్నారట. గతంలో కూడా తొలకరి జల్లులు పడగానే పల్నాడు జిల్లాలోని స్థానికులు కోళ్లూరు వెళ్లి.. అక్కడ కొండల్లోనే ఉంటూ వజ్రాలు కోసం వెతికే వారని చెబుతున్నారు. ఇప్పుడు అదే నమ్మకంతో బసవమ్మ వాగు వద్ద జరుగుతున్న వజ్రాల వేట కొనసాగుతోంది .సాధారణంగా రాయలసీమ ప్రాంతంలోని కర్నూలు, అనంతపురం జిల్లాల్లో తొలకరి వానలు పడగానే వజ్రాల కోసం వేట ప్రారంభమవుతుంది. ఇటీవల పలువురు రైతులు, వ్యవసాయ కూలీలకు వజ్రాలు దొరికాయి.. వాటిని దక్కించుకునేందుకు వ్యాపారులు పోటీపడుతుంటారు. ఒక్క వజ్రం దొరికితే చాలు లక్షాదికారి, కోటీశ్వరులు కావొచ్చని ఆశగా వెళుతుంటారు. పల్నాడు జిల్లాలో కూడా అదే ఆశతో జనాలు వజ్రాల వేటకు వెళుతున్నారు

# ప్రతిపక్ష సమావేశానికి మమత హాజరు

**బెంగళూరు, జూలై 17 :**

అసలే పోటాపోటీగా అధికార, ప్రతిపక్ష కూటములు సమావేశాలు ఏర్పాటు చేశాయి. ఎవరికి వారుగా తమ బలాన్ని, ఐక్యతను చాటే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమిలో ముఖ్య నేత ఎవరైనా హాజరుకాలేదంటే.. కారణమేదైనా సరే ఎన్నో అర్థాలు, అపార్థాలు, ఊహాగానాలు మొదలవుతాయి. సాకులు చూపి సమావేశానికి డుమ్మా కొట్టారని ఎద్దేవా కూడా చేస్తారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితే ప్రతిపక్ష కూటమికి ఎదురైంది.కాంగ్రెస్ పార్టీ బెంగళూరులో ఏర్పాటు చేసిన ప్రతిపక్షాల ఐక్యవేదిక సమావేశానికి మమత బెనర్జీ హాజరు కాలేనని తెలియజేశారు. కాలికి తగిలిన గాయం కారణంగానే తాను హాజరుకాలేకపోతున్నానని, అయితే తన తరఫున ప్రతినిధిని సమావేశానికి పంపిస్తానని చెప్పారు. ఈసారి సమావేశం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్, మమత బెనర్జీ ఇచ్చిన సమాచారంతో నిరుత్సాహానికి గురైంది. ఆమె గైర్హాజరుపై జరిగే ప్రచారం, పర్యవసానాలను ఊహించింది. ఎలాగైనా సరే మమతను సమావేశానికి రప్పించాలని భావించింది. అంతే ఏకంగా సోనియా గాంధీయే రంగంలోకి దిగారు. నేరుగా మమతకు ఫోన్ చేశారు. ప్రతిపక్షాల ఐక్యతను దెబ్బతీసేందుకు అధికారపక్షం చేస్తున్న కుట్రలు, తాజాగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో చోటు చేసుకున్న పరిణామాలు ఉదహరిస్తూ వీలైనంత వరకు హాజరుకావడానికే ప్రయత్నించాలని కోరారు. ఈసారి సమావేశానికి తాను కూడా హాజరవుతానని చెప్పినట్టు తెలిసింది. సోనియా గాంధీయే స్వయంగా ఫోన్ చేసినందున మమత బెనర్జీ కూడా మనసు మార్చుకున్నారని సమాచారం.బెంగళూరులో జరిగే విపక్షాల సమావేశంలో ఈసారి మొత్తం 24 పార్టీలు పాల్గొంటున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. జూన్‌లో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పాట్నాలో ఏర్పాటు చేసిన ప్రతిపక్షాల తొలి సమావేశానికి 15 పార్టీల నేతలు మాత్రమే హాజరయ్యారు. కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ముఖ్య నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఈసారి కాంగ్రెస్ పార్టీయే సమావేశాన్ని నిర్వహిస్తున్నందున ఈ ఇద్దరు నేతలతో పాటు సోనియా గాంధీ కూడా హాజరవుతారని తెలుస్తోంది. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పాల్గొననుంది. అయితే ఢిల్లీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ విషయంలో ఆప్, కాంగ్రెస్ పార్టీల మధ్య వాగ్వాదం నెలకొంది. ఆర్డినెన్స్‌ను రాజ్యసభలో ఆమోదించకుండా అడ్డుకోవాలంటే కాంగ్రెస్ వ్యతిరేకించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తోంది. దీనిపై ప్రతిపక్షాల్లో ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు.బెంగళూరు సమావేశంలో ప్రతిపక్షాలకు సంబంధించి ఉమ్మడి ఎజెండాపై చర్చించనున్నారు. దీంతోపాటు మూడు కార్యవర్గాల ఏర్పాటుపై కూడా సమావేశంలో నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. వివిధ రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల మధ్య పొత్తుకు సంబంధించిన పూర్తి రూపురేఖలను సిద్ధం చేయడమే కార్యవర్గం పని. ఎన్నికల్లో పోటీ చేసే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థులపై ఎవరిని నిలబెట్టాలి? గెలుపు కోసం ఎలాంటి వ్యూహం అనుసరించాలనేది కార్యవర్గం నిర్ణయిస్తుంది. దేశవ్యాప్తంగా 450 నియోజకవర్గాల్లో బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలన్నీ కలిసి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపాలని ఇదివరకటి సమావేశంలోనే నిర్ణయించుకున్నాయి. అయితే ఇదంత ఆషామాషీ వ్యవహారం కాదు. పైకి ఒక వేదికపై చేతులు కలిపి ఐక్యతను చాటే ప్రయత్నం చేస్తున్న ఈ పార్టీలు, వివిధ రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నాయి. పైగా ఉమ్మడి అభ్యర్థి అనేసరికి ఆయా పార్టీల్లో టికెట్ ఆశించే అభ్యర్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది. వారిలో సొంత బలం ఉన్న నేతలు తిరుగుబాటు అభ్యర్థిగా స్వతంత్రంగా పోటీలో దిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఆయా పార్టీలు అసంతృప్త నేతలను బుజ్జగించినా.. వారు ఎన్నికల్లో సహకరించే అవకాశాలు తగ్గిపోతాయి. ఈ పరిస్థితులను డీల్ చేయడం కోసమే ప్రతిపక్షాలు కార్యవర్గాలను రూపొందించుకోవాలని భావిస్తున్నాయి.

# రాజన్న చిల్లర నాణేల సమస్యకు పరిష్కారం

**కరీంనగర్, జూలై 17 :**



దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దర్శనానికి.. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ప్రతిరోజు అర్చక స్వాములు స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆ సమయంలో స్వామివారికి మొక్కులరూపంలో బంగారం, వెండి వెండితోపాటు డబ్బులను హుండీ స్వామివారికి సమర్పిస్తారు. గత కొన్ని నెలలుగా హుండీ ఆదాయం లెక్కించిన సమయంలో బ్యాంకర్లు నోట్లను తీసుకోగా చిల్లరను తీసుకోకపోవడంతో కుప్పలు, తేప్పలుగా నాణేలు పేరుకుపోయాయి. దీంతో గత కొన్ని నెలలుగా ఆలయ అధికారులు లాకర్ లో నాణేలతో కూడిన సంచులను భద్రపరిచారు.గత కొన్ని నెలలుగా చిల్లర నాణేలు ఏ బ్యాంక్ అధికారులు తీసుకోకపోవడంతో ఆలయ ఉన్నతాధికారులకు సమస్యగా మారింది. అయితే ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆలయ అధికారులు నాణేలను తీసుకోవాలని బ్యాంకు అధికారులతో మాట్లాడడంతో వారు తీసుకునేందుకు అంగీకరించారని.. ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. దీంతో రాజన్న చిల్లర నాణేలను ఆలయ ఓపెన్ స్లాబ్ లో రెండు రోజులపాటు శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు, ఆలయ అధికారులు సిబ్బంది లెక్కించగా మొదటి రోజు 41లక్షల 40వేల రూపాయలు రాగా.. రెండవ రోజు 40లక్షల 12వేల 500 రూపాయలు వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ మొత్తాన్ని యూనియన్ బ్యాంక్ కు అందించడంతో చిల్లర నాణేల సమస్య తీరిపోయింది.యూనియన్ బ్యాంక్ అధికారులు 4 తూకం కేంద్రాలను ఏర్పాటు చేసి.. నాణేలను తూకం వేసి పాలిథిన్ కవర్లలో నింపుపారు. ఒక్కో సంచిలో రూ.2వేల 200 నింపి సీజ్ చేస్తున్నారు. రెండు రోజుల్లో మొత్తం 82లక్షల 12వేల 500 రూపాయలు బ్యాంక్ అధికారులకు అప్పగించారు. స్వామివారి హుండీ లెక్కింపులో పాల్గొన్న సేవాసమితి సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థప్రసాదాలను ఆలయ ఉన్నతాధికారులు అందజేశారు. సీసీ కెమెరాలు పోలీస్ ప్రతిష్ట భద్రత నడుము ఉండి లెక్కింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు. ఈ ఉండి లెక్కింపు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించినట్లు వెల్లడించారు.

# రుణమాఫీ కోసం 31 లక్షల మంది రైతుల ఎదురుచూపు

**హైదరాబాద్, జులై 17:**



రైతుల పంట రుణాలు మాఫీ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. 2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.లక్ష రుణమాఫీ హామీ నెరవేర్చేందుకు ప్రయత్నాలు మొదలైనట్టుగా ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉండడం.. పంట రుణాలు మాఫీ చేయకపోవడంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. కరోనా సాకుతో ప్రభుత్వం నాలుగున్నరేండ్లుగా రైతుల లోన్లు మాఫీ చేయలేదు. దీంతో లక్షల మంది రైతులు ఎగవేతదారులు(డిఫాల్టర్లు)గా మారారు. బ్యాంకర్లు లోన్?లు చెల్లించాలని వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో ప్రభుత్వంపై రైతుల్లో వ్యతిరేకత పెరుగుతున్నది. క్రాప్ లోన్లు మాఫీ చేయకుంటే రైతులంతా కారు పార్టీకి వ్యతిరేకంగా పని చేయడం ఖాయమన్న సర్వే రిపోర్టులు, ఇంటెలిజెన్స్ నివేదికలతో ప్రగతి భవన్ వర్గాలు అలర్ట్?అయ్యాయి. సెప్టెంబర్ నెలాఖరుకే రైతుల లోన్లు మాఫీ చేయాలని నిర్ణయించినట్టుగా తెలుస్తున్నది. ఇందుకు అవసరమైన నిధులు సమీకరించాలని ఆర్థిక శాఖకు ఆదేశాలిచ్చినట్టుగా ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి.2018 డిసెంబర్?11 నాటికి ఉన్న పంట రుణాలను వడ్డీతో కలిపి రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని బీఆర్ఎస్ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. అసెంబ్లీ వేదికగానూ సీఎం కేసీఆర్ ఇదే విషయం చెప్పారు. నాలుగేండ్లలోనే రైతులను రుణ విముక్తులను చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్?తేదీ నాటికి రాష్ట్రంలో 40.66 లక్షల మంది రైతులకు రూ.25,936 కోట్ల (రూ.లక్ష లోపు) రుణం ఉన్నట్టుగా నిర్ధారించారు. ఒక కుటుంబంలో ఒక్కరికే ప్రయోజనం పేరుతో ఇందులో 3.98 లక్షల మందిని అనర్హులుగా ప్రకటించారు. 36.68 లక్షల మందికి చెందిన రూ.19,198.38 కోట్లు మాఫీ చేయాల్సి ఉందని లెక్కగట్టారు. ఇప్పటి వరకు 5.66 లక్షల మందికి చెందిన రూ.1,207 కోట్లు మాత్రమే మాఫీ చేశారు. రూ.60 వేల వరకు రైతులు తీసుకున్న లోన్లు మాఫీ చేశామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ.. రూ.37 వేల వరకు ఉన్న రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. రుణమాఫీ చేయాల్సిన వారిలో వీరి సంఖ్య 6 శాతం మాత్రమే. మిగతా లోన్లు మాఫీ చేయాల్సి ఉంది. ఈ రైతుల సంఖ్య భారీగా ఉండటంతో మాఫీ చేయకుంటే వారంతా రివర్స్?అయ్యే ప్రమాదముందని ప్రభుత్వానికి సంకేతాలు అందాయి. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో గత ఎన్నికల హామీని నెరవేర్చకుండా మళ్లీ గెలవడం కష్టమని నిర్ధారణకు వచ్చారు. ఈనేపథ్యంలో రుణమాఫీ చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. రైతుబంధు, బీమా, ఉచిత కరెంట్?ఇస్తున్నా రుణమాఫీ చేయకపోవడంతో రైతులు సర్కారుపై అసంతృప్తితో ఉన్నారు. ఈ అసంతృప్తి ఇలాగే ఉంటే రైతు కుటుంబాల ఓట్లు దూరమయ్యే ప్రమాదముందని హెచ్చరికలు అందాయి. ఆయా కుటుంబాలకు ఇతర పథకాలు అందుతున్నా పంట రుణాలు వారికి గుదిబండగా మారాయి. కొన్ని చోట్ల రైతుబంధు మొత్తాన్ని బ్యాంకర్లు పాత లోన్ల రీపేమెంట్?కింద కట్?చేశారు. ఇది కొంప ముంచుతుందనే భయంతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆయా బ్యాంక్?అధికారులతో మాట్లాడి రైతుబంధు మొత్తాన్ని రైతులకు చెల్లించేలా ఒప్పించారు. కొందరు ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రుణమాఫీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే పుట్టి మునిగే ప్రమాదముందని చెప్పారు. సర్వేలు, ఇంటెలిజెన్స్ రిపోర్టులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని, ఆర్థికంగా ప్రతిబంధకాలున్నా రుణమాఫీ చేయడం వైపే ప్రభుత్వ పెద్దలు మొగ్గు చూపుతున్నారు. రుణమాఫీకి అవసరమైన రూ.20 వేల కోట్ల వరకు సొమ్ము సమకూర్చాలని ఇప్పటికే ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారని చెప్తున్నారు.

# కేసీఆర్ సెంటిమెంట్ ఆలయంలో దొంగల హల్ చల్

**సిద్దిపేట**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్ రావుకు సెంటిమెంట్ అయిన ఆలయంలో దొంగలు బీభత్సం సృష్టించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం కొనాయిపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి దొంగలు పడ్డారు. గుడిలోని హుండీని ఎత్తుకెళ్లారు. కేసీఆర్కు ఈ ఆలయం అత్యంత ఇష్టమైనది. గతంలో ఏ ఎన్నికల్లో పోటీ చేసినా ముందు నామినేషన్ పత్రాలను ఈ ఆలయంలో పెట్టి పూజలు చేసి, ఆ తర్వాతే నామినేషన్ దాఖలు చేసేవారు. తెలంగాణ ఉద్యమం మొదలు పెట్టినప్పుడు కూడా ముందు ఇక్కడికి వచ్చి పూజలు చేసి వెళ్లారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కేసీఆర్ పలుమార్లు ఈ ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. మంత్రి హరీశ్ రావుకూ ఈ ఆలయం అత్యంత సెంటిమెంట్. ప్రతి ఎన్నికలప్పుడు ఇక్కడ నామినేషన్ పత్రాలకు పూజలు చేయించడాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆలయంలో దొంగలు పడటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన ఆలయానికి చేరుకున్నారు. దొంగలు మరికొన్ని ఆలయాల్లో కూడా చోరీ చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల పతకాల పంట

**పెద్దపల్లి**




జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు పతకాల పంట పండించారు. ఈ నెల 15, 16 వ తేదీల్లో హైదరాబాద్ లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ లో పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ కి చెందిన విద్యార్థులు అండర్-14 విభాగంలో పోటీ పడి పలు పతకాలు సాధించారు. పానుగంటి అశ్విత్ (గోల్డ్ మెడల్), కొయ్యడ గౌతమ్ (సిల్వర్ మెడల్), అమృతేశ్వర్, ఎ. నవదీప్, ఎం. మన్విత్ రెడ్డి లు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఆధునిక సమాజంలో ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాల్సి న అవసరం ఉన్నదని, అందుకే మా పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్న ట్లు చెప్పారు. అనంతరం పతకాలు సాధించి పాఠశాలకు వన్నె తెచ్చిన విద్యార్థులను, కరాటే మాస్టర్ మల్యాల రామస్వామి లను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, పిఇటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పొంగిపొర్లుతున్న గ్రేటర్ మ్యాన్ హోల్స్

**హైదరాబాద్, జులై 17:**



గ్రేటర్ లో మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. వర్షాలు అంతగా పడకపోయినా కూడా మ్యాన్ హోల్స్ పొంగుతున్నాయి. మెయిన్ రోడ్లపై నుంచి కాలనీలు, బస్తీలు రోడ్ల దాకా ఇదే పరిస్థితి ఉంది. కొన్ని జంక్షన్ల వద్ద సిగ్నల్ పడినప్పుడు బైక్ లను ఆపి కాలు కింద పెడదామన్నా పెట్టలేకుండా వరద నిలిచి ఉంటోంది. నానల్ నగర్ లాంటి జంక్షన్ వద్ద తరచూ మ్యాన్ హోల్స్? పొంగి రోడ్డుపై మురుగంతా పారుతుండడంతో వెహికల్స్ నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సీవరేజ్ వాటర్ లీకేజీ కారణంగా ట్రాఫిక్ స్లో అవుతోందని కొన్ని ఏరియాల్లో ట్రాఫిక్ పోలీసులు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇంకొన్నిచోట్ల కార్లు స్పీడ్ గా వెళ్తుండగా బైక్ లపై వెళ్తున్న వారిపై మురుగు పడుతోంది. వాహనదారుల మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. సిటీలో దశాబ్దాల కిందట నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ కావడంతో పైప్ లైన్లు ప్రస్తుత కెపాసిటీని తట్టుకోలేకపోతుండడమే మ్యాన్ హోల్స్ పొంగిపొర్లేందుకు కారణమంటూ ఎక్స్ పర్ట్స్ చెబుతున్నారు. ప్రతి ఏటా కొన్ని ప్రాంతాల్లో పనులు చేసి ఉంటే ఇలాంటి సమస్యలు వచ్చేవి కాదని పేర్కొంటున్నారు. దీనిపై వాటర్ బోర్డు దృష్టిపెట్టకపోవడంతోనే సిటీలో మురుగు పారే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం వస్తున్న ఫిర్యాదుల్లో సీవరేజీ ఓవర్ ఫ్లో వే ఎక్కువగా ఉంటున్నా స్పందించడం లేదు. డ్రైనేజీ పైప్ లైన్ల రిపేర్లు, మెయింటెనెన్స్?పేరుతో ప్రతినెల రూ. కోట్లలో వాటర్ బోర్డు ఖర్చు చేస్తోంది. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. వర్షపు నీటితో మ్యాన్ హోల్స్?నిండిపోయి తరచూ పొంగడం కామన్ అనే విధంగా అధికారుల తీరు ఉంటోందని జనం మండిపడుతున్నారు. ఈ ఏడాది సమ్మర్?లోనే చర్యలు తీసుకుని ఉంటే వానాకాలంలో ఇబ్బందులు తప్పేవని, ప్రస్తుతం భారీ వర్షాలు పడితే మ్యాన్ హోల్స్ పొంగి దారుణ పరిస్థితులు నెలకొంటాయని జనం భయాందోళనకు గురవుతున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిటీలో డ్రైనేజీ సిస్టం లేదని.. అవసరమైన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా వెంటనే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. వాటర్ బోర్డు పరిధిలో 200కు పైగా ప్రాంతాల నుంచి రెగ్యులర్ గా అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఒక్కోచోట 10 నుంచి 15 రోజులుగా మ్యాన్?హోల్స్? పొంగిపొర్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సిటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీహెచ్ఈఎల్, సోమాజిగూడ, నానల్?నగర్, మాసబ్ ట్యాంక్, లక్డీకపూల్, టోలిచౌకి, అల్వాల్, లంగర్ హౌస్, చాంద్రాయణగుట్ట, ఆర్కేపురం, ఉప్పల్, మౌలాలి?తదితర ప్రాంతాల్లో ఎక్కువగా మ్యాన్ హోల్స్?పొంగిపొర్లుతున్నాయి. రోడ్లపై రోజుల తరబడి మురుగు పారుతుండగా వాటర్ బోర్డు ట్విట్టర్?, గ్రీవెన్స్? సెల్ కి జనం ఫిర్యాదులు చేస్తున్నారు. మరోసారి ఇబ్బందులు లేకుండా ఉండేలా పకడ్బందీగా పనులు చేయకపోవడంతో తరచూ సమస్య ఏర్పడుతోందని మండిపడుతున్నారు. వానలు పడనప్పుడే సిటీలో పరిస్థితి ఇలా ఉంటే, ఇక వర్షాలు పడితే మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతుంటాయి. వరద మురుగునీటిలో కలిసిపోతుంది. రోడ్లపై వెళ్లే జనం ఇబ్బందులు ఎదుర్కొంటారు. కొన్నిచోట్ల నిత్యం సమస్య ఉంటుండగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో జంక్షన్ల వద్ద పోలీసులు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద మ్యాన్ హోల్స్ ఓవర్ ఫ్లో అవుతుంది. ఈ మధ్య నెలరోజుల్లో మూడుసార్లు ఇదే సమస్య తలెత్తింది. దీంతో అక్కడ ట్రాఫిక్ స్లోగా సాగుతుంది. బీహెచ్ఈఎల్ వద్ద కూడా వానలు కురిసినప్పుడు నిలిచిన మురుగు నీరు రోడ్లపై పారింది . ఇలా అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య ఏర్పడుతోందని స్థానిక జనం వాపోతున్నారు.

# సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్నబీజేపీ, కాంగ్రెస్ పార్టీలు



**న్యూఢిల్లీ/బెంగళూరు జులై 17**

దేశంలో రానున్న సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పావులు కదుపుతున్నాయి. నేడు, రేపు పోటాపోటీగా అధికార విపక్షాల కూటమి సమావేశాలు జరగనున్నాయి. ఈరోజు, రేపు బెంగళూరులో విపక్షాలు భేటీ అవుతుండగా, రేపు ఢిల్లీలో ఎన్డీయే మిత్రపక్షాల సమావేశం జరగనుంది. ఇవి రెండూ కీలక సమావేశాలే కావడం గమనార్హం. విపక్షాల సమావేశానికి 26 పార్టీలకు ఆహ్వానం అందింది. ఎన్డీయే కూటమి సమావేశానికి సుమారు 30 పార్టీలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. విపక్ష భేటీలో కూటమికి కొత్త పేరు, సమన్వయకర్తల నియామకం, సీట్ల సర్దుబాటు కోసం కమిటీల ఏర్పాటుపై ప్రధానంగా చర్చ జరగనున్నట్లు తెలిసింది.ఢిల్లీ ఆర్డినెన్స్, యూసీసీ, ద్రవ్యోల్బణం, విదేశాంగ విధానం, నిరుద్యోగం తదితర అంశాలపై మోదీ ప్రభుత్వాన్ని చుట్టుముట్టే వ్యూహంపైనా విపక్ష నేతలు చర్చించనున్నారు. ఢిల్లీ ఆర్డినెన్స్ విషయంలో ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్ ఇప్పటికే మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మద్దతిచ్చిన నేపథ్యంలో విపక్ష భేటీకి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా హాజరవుతుండటం విశేషం. అయితే.. ఈ మొత్తం ఎపిసోడ్‌లో కర్ణాటకకు చెందిన జేడీఎస్ పార్టీ వైఖరి అంతుచిక్కడం లేదు. బీజేపీతో జేడీఎస్ మైత్రి ఏర్పాటు చేసుకుంటుందనే ప్రచారం నేపథ్యంలోనే మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి సోమవారం ఢిల్లీ వెళు తున్నాతారనే చర్చ జోరందుకుంది. శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి తర్వాత జేడీఎస్‌తో కలసి వెళ్లాలనే ప్రయత్నాలు సాగుతున్న విషయం తెలిసిందే.

# కిషన్ రెడ్డికి లండన్‌లో సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం

**- అట్టహాసంగా 'మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ యూకే విభాగం**

**- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**- తొమ్మిదేళ్లలో మోదీ సర్కారు చేసిన కార్యక్రమాలను వివరించిన కేంద్రమంత్రి**

**లండన్**

న్యూయార్క్ పర్యటన ముగించుకుని లండన్ హీత్రో ఎయిర్పోర్టుకు చేరుకున్న కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ – యూకే విభాగం ఆధ్వర్యంలో విమానాశ్రయంలో సంప్రదాయ పద్ధతిలో స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఢోల్ వాద్యాలు, వేద మంత్రోచ్ఛారణ, హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని దీపప్రజ్వలనతో కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. గత 9 ఏళ్లలో నరేంద్రమోదీ సర్కారు చేపట్టిన కార్యక్రమాలను, ఈ సందర్భంగా భారతీయ సమాజంలో వచ్చిన మార్పులను వివరించారు. విదేశాల్లో ఉంటున్న భారతీయుల ఆకాంక్షలను పూర్తిచేయడం, విదేశాల్లో వారికి సరైన గౌరవం లభించేలా మోదీ సర్కారు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం పలువురు యువతీ యువకులు అడిగిన ప్రశ్నలకు కిషన్ రెడ్డి సమాధానం చెప్పారు.



ఈ సందర్భంగా 'సంస్కృతి సెంటర్ ఫర్ కల్చరల్ ఎక్సెలెన్స్' విద్యార్థులైన యువత చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

# కేసీఆర్ అసలు నువ్వు ఎక్కడి నుంచి వచ్చావు?

**చంద్రబాబు దయా దక్షిణ్యాలతోనే బీఆర్ఎస్ నేతలకు రాజకీయ భిక్ష**

**మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్**



**జగిత్యాల జులై 17**

మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇటీవలి కాలంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబును జత చేస్తూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జీవన్‌రెడ్డి.. కేటీఆర్‌పై విమర్శల వర్షం కురిపించారు. "నీ పోచారం శ్రీనివాసరెడ్డి చంద్రబాబు పంచన లేడా? నీ దయాకర్ రావు చంద్రబాబు పంచన లేడా? నీ తలసాని శ్రీనివాస్ యాదవ్ చంద్రబాబు పంచన లేడా?గంగుల కమలాకర్ ది ముందు టీడీపీ కాదా? బాబూ కేసీఆర్ అసలు నువ్వు ఎక్కడి నుంచి వచ్చావు? రేవంత్ రెడ్డి గురించి తెలుసుకుని మాట్లాడండి. చంద్రబాబు దయా దక్షిణ్యాలతోనే బీఆర్ఎస్ నేతలకు రాజకీయ భిక్ష. నీ మంత్రి వర్గం మొత్తం టీడీపీలోనే పుట్టింది. రాహుల్‌కు నీలాగా వాస్తవాలను వక్రీకరించడం రాదు. నువ్వా రాహుల్ గాంధీ గురించి మాట్లాడేది..? మేము ఉచిత విద్యుత్ ఇచ్చినప్పుడు నీ బతుకు దెరువు ఏంది కేటీఆర్? కాంగ్రెస్ ఆందోళనతోనే మూడు రోజులుగా 24 గంటలు ఇస్తున్నారు. ఆ సోయి మొన్నటిదాకా ఎందుకు లేదు కేటీఆర్?" అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు.

# పాతబస్తీలో మెట్రో పనులు వేగవంతం

**హైదరాబాద్, జూలై 17:**

పాతబస్తీ మెట్రో రైలు పనులకు సంబందించిన కసరత్తులను మొదలు పెట్టినట్లు మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. నెలరోజుల్లో భూకేసరణకు నోటీసులు జారీ చేస్తామని వివరించారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు రైలు నడిపేందుకు గతంలో ప్రతిపాదన వచ్చిందన్నారు. భూ సేకరణలో సమ్యలు తలెత్తడంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే తాజాగా ఈ పనులను పూర్తి చేసేందుకు హెచ్ఎంఆర్ఎల్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. పాతబస్తీలో మెట్రోరైల్ మార్గంలో 5 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మార్గంలో 103 మతపరమైన నిర్మాణాలు ఉన్నాయని.. వాటిలో 4 నిర్మాణాల విషయంలో సమస్యలు తలెత్తాయని అన్నారు. త్వరలోనే వీటిని కూడా పరిష్కరిస్తామన్నారు. హైదరాబాద్ ప్రజలంతా ఎప్పుడెప్పుడూ అని వేచి చూస్తున్న పాతబస్తీ మెట్రో త్వరలోనే అందుబాటులోకి రాబోతుందని మంత్రి కేటీఆర్ ఇటీవలే తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని మెట్రో రైలు ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ చైర్మన్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎంజీబీఎస్ – ఫలక్ నుమా మార్గాల మధ్య పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పినట్లు ట్విట్టర్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. మెట్రో రైలు తొలి విడత కింద 69.2 కిలో మీటర్లు నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థ వివిధ అభ్యంతరాల నేపథ్యంలో పాతబస్తీ మార్గాన్ని నిర్మించే విషయంలో చేతులు ఎత్తేసింది. రాయదుర్గంతో పాటు పలు ప్రాంతాల్లో అక్కడక్కడా కలిపి సుమారు 2.7 కిలో మీటర్లు అదనంగా నిర్మిస్తే ఈ మార్గం పూర్తి అవుతుంది. అలాగే నిలిచిపోయిన ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా మార్గాన్ని కూడా పూర్తి చేస్తే మెట్రో విస్తీర్ణం 74.7కిలో మీటర్లు పూర్తి అవుతుంది. హైదరాబాద్ మెట్రో రైలును పొడిగించాలన్నది పాతబస్తీ వాసుల చిరకాల డిమాండ్. ఆల్ ఇండియా మజ్లిస్–ఇ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ అనేక బహిరంగ ప్రసంగాలలో ఈ విషయాన్ని తెలిపారు. అయితే మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్ చూసి ఆయన స్పందించారు. పాతబస్తీ ప్రజలు దీని కోసం చాలా ఏళ్లుగా వేచి చూస్తున్నారని చెబుతూ రీట్వీట్ చేశారు.



ఇది కచ్చితంగా పాతబస్తీ ప్రజలకు సహాయం చేస్తుందని మరింత పర్యాటకాన్ని కూడా తీసుకు వస్తుందని వివరించారు. గత నెలలో రెండు వేర్వేరు ప్రసంగాల్లో పటాన్‌చెరు, కందకూరు వరకు మెట్రోను పొడిగిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. 2023–24 రాష్ట్ర బడ్జెట్‌లో పాతబస్తీ వరకు మెట్రో రైలు సేవలను పొడిగించేందుకు రూ.500 కోట్లు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సుమారు ఆరు సంవత్సరాలుగా ఎంజీబీఎస్ నుంచి ఫలక్ నుమా వరకు 5.5 కిలో మీటర్ల మార్గం నిలిచిపోయింది. ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో ప్రార్థనా మందిరాలు తొలగించాల్సి రావడంతో అప్పట్లో మజ్లిస్ పార్టీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈక్రమంలోనే మార్గాన్ని మళ్లించేందుకు సర్వే నిర్వహించినా ముందడుగు పడలేదు.

# ఆగస్టు 9 నుంచి ఇంజనీరింగ్ రెండో దశ కౌన్సెలింగ్

**ఇంకా భర్తీ కాకుండా మిగిలిన 12,001 సీట్లు**

**సివిల్, మెకానికల్ విభాగాలపై విద్యార్థులు అనాసక్తి**

**హైదరాబాద్, జూలై 17**

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కోర్సుల్లో సుమారు 12 వేల సీట్లు మిగిలాయి. సివిల్, మెకానికల్ విభాగాల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఎంసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి దశ సీట్ల కేటాయింపు ఆదివారం చేశారు. కన్వీనర్ కోటాలో మొత్తం 82,666 ఇంజనీరింగ్ సీట్లు ఉండగా, ప్రస్తుతం ఇందులో 70,665 సీట్లను కేటాయించారు. ఇంకా 12,001 సీట్లు భర్తీ కాకుండా మిగిలాయి. మొత్తం సీట్లలో 85.48 శాతం భర్తీ అయ్యాయి. 75,708 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. ఇందులో 70,665 మందికి సీట్లు కేటాయించారు. ప్రభుత్వ యూనివర్సిటీ కాలేజీల్లో 85.12 శాతం, ప్రైవేట్ యూనివర్సిటీల్లో 75.08 శాతం, ప్రైవేట్ కాలేజీల్లో 85.71 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 5,576 మంది విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 22లోపు ఫీజు చెల్లించి, ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థులు ఇప్పటికే దోస్త్ ద్వారా డిగ్రీ కోర్సుల్లో చేరినట్టేయితే ఆ సీటును వదులుకుంటున్నట్టు అండర్‌టేకింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఉద్యోగాలు వస్తాయని భావిస్తున్న ఇంజనీరింగ్ కోర్సులకే విద్యార్థులు మొగ్గు చూపారు. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సులనే ఎక్కువగా కోరుకున్నారు. మెకానికల్, సివిల్ వంటి కోర్సుల్లో చేరడానికి ముందుకు రావడం లేదు. అలాగే బిల్డింగ్ సర్వీసెస్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, మైనింగ్ ఇంజనీరింగ్, ప్లానింగ్ వంటి కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. 28 సీట్లు ఉన్న ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్, 21 సీట్లు ఉన్న ఎలకా?ట్రనిక్స్ అండ్ టెలికమ్యూనికే షన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. రెండో దశ కౌన్సెలింగ్ ఆగస్టు 9 నుంచి నిర్వహించనున్నారు.

# డీజీపీ అపాయిట్ మెంట్ ఇవ్వడంలేదు

**విశాఖపట్నం**

తనపై అనేక జుగుప్సాకరమైన రాతలు రాయిస్తోంది సీఎం జగన్ భార్య భార తియేనని, స్వయంగా సీఎం సలహాదా రు సజ్జల రామ కృష్ణారెడ్డి కుమారుడు సజ్జలు భార్గవ రెడ్డి సోషల్ మీడియా లో ఈ రాతలు రాయిస్తున్నారని తెలు గు మహిళా అధ్యక్షురాలు వంగలపూ డి అనిత ఆరోపించారు. విశాఖ టీడీపీ కార్యాలయంలో అనిత మాట్లాడు తూ.. చదువుకున్న దళిత ఆడబిడ్డ పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని తనకు అండగా నిలిచింది చంద్రబాబు అన్నారు. విమర్శించారు కదా అని.. ఇంట్లో కూర్చునే మనిషిని కాదని, పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. మేం అడిగే ప్రశ్నలకు వైసీపీ నేతలు జవాబు చెప్పడం లేదన్న అనిత.. టీడీపీ, ఇతర పార్టీల మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు.



రాష్ట్రంలో మద్యపాన నిషేధం ఎప్పట్నుంచి చేస్తారో చెప్పాల ని డిమాండ్ చేశారు. వైసీపీ అధికా రంలోకి వచ్చిన నాలుగేళ్లలో 4 వేల అత్యాచారాలు జరిగాయని.. న్యాయ స్థానాలు సుమోటోగా తీసుకుని దర్యాప్తునకు ఆదేశించాల్సిందిగా అనిత కోరారు. మహిళలపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసభ్య ప్రచారాన్ని రాష్ట్ర పోలీస్ డీజీపీని కలిసి ఫిర్యాదు చేద్దామంటే అపాయిం ట్మెంట్ ఇవ్వడం లేదని అనిత తెలిపారు.

# శామీర్ పేట కాల్పులు.. మనోజ్ అరెస్ట్

**హైదరాబాద్, జూలై 17:**

మేడ్చల్ జిల్లా శామిర్‌పేట్ లో సెలబ్రిటీ కాల్పుల కేసులో నటుడు మనోజ్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నేటి ఉదయం నటుడు మనోజ్ కు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అల్వాల్‌లో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు పోలీసులు. అల్వాల్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు కాల్పులు జరిపిన నిందితుడు మనోజ్ ను పోలీసులు రిమాండ్‌లోకి తీసుకున్నారు. అక్కడి నుంచి చర్లపల్లి జైలుకు తరలించారు. శామిర్‌పేట్ సెలబ్రిటీ క్లబ్‌లో శనివారం కాల్పుల ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. సిద్ధార్థ దాస్ అనే వ్యక్తి భార్య వద్దకు రాగా, ఆమెతో సహజీవనం చేస్తున్న నటుడు మనోజ్ తో గొడవ జరిగింది. ఈ క్రమంలో మనోజ్‌కుమార్ ఎయిర్‌గన్‌తో సిద్ధార్థ దాస్‌పై కాల్పులు జరిపాడు. అలర్ట్ అయిన సిద్ధార్థ్ అక్కడి నుంచి తప్పించుకుని శామిర్ పేట్ పోలీసులను ఆశ్రయించాడు. నటుడు మనోజ్ తనపై కాల్పులు జరిపాడని ఫిర్యాదు చేయగా, ఆర్మ్స్ యాక్ట్ కింద మనోజ్‌పై కేసు నమోదు చేశారు. నేడు నిందితుడు మనోజ్ ను మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు పోలీసులు తరలించారు. ఏపీలోని విశాఖపట్నానికి చెందిన 49 ఏళ్ల సిద్దార్థ దాస్ కు ఒఢిశాలోని బరంపూర్ కు చెందిన 43 ఏళ్ల స్మితాదాస్ తో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ప్రస్తుతం 17 ఏళ్ల వయసున్న కుమారుడు, 13 ఏళ్లు ఉన్న కుమార్తె ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో.. స్మిత విడాకులు కావాలంటూ 2019లో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. పిల్లలతో పాటు తాను వేరే చోట ఉంటానని... అక్కడకు తన భర్తని రానీయకుండా చూడాలంటూ కోర్టును కోరింది. ఆదేశాలను కూడా తెచ్చుకుంది. అయితే ప్రస్తుతం ఇద్దరు పిల్లల్ని తన వందే ఉంచుకొని చూసుకుంటుంది స్మిత. ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడే వారికి స్మితాదాస్ కౌన్సిలింగ్ ఇచ్చేది. శంభో శివ శంభో, వినాయకుడు చిత్రాల్లో నటించిన 39 ఏళ్ల మనోజ్ కౌన్సిలింగ్ తీసుకున్నాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇతడు.. ఒత్తిడి భరించలేక స్మితా వద్ద కౌన్సిలింగ్ కు వచ్చాడు. ఇలా వీరిద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. అదికాస్తా ప్రేమగా మారి సహజీవనానికి దారి తీసింది. అయితే గత మూడేళ్లుగా వీరిద్దరూ శామిర్ పేటలోని సెలబ్రిటీ విల్లాలో నివాసం ఉంటున్నారు. అయితే ఇటీవలే వీరిద్దరూ కలిసి విజయవాడలో ఓ కార్యాలయం ప్రారంభించినట్లు పోలీసులు గుర్తించారు. అయితే మనోజ్... తననూ, తన చెల్లిని ప్రతిరోజూ కొడుతున్నాడని, తీవ్రంగా వేధిస్తున్నాడని స్మితా దాస్ కుమారుడు జూన్ 12వ తేదీన బాలల సమరక్షణ కమిటీని ఆశ్రయించాడు. తల్లి వద్ద కానీ, వారి బంధువుల వద్ద కానీ ఉండనంటూ చెప్పాడు. దీంతో సీడబ్ల్యూసీ అధికారులు బాలుడిని సంరక్షణ గృహానికి తరలించారు. అయితే ఈనెల 18వ తేదీన బాలికతో కలిసి స్మితా విచారణకు రావాలని సీడబ్ల్యూసీ అధికారులు స్మితకు నోటీసులు పంపించారు.

# పవన్ నాలుక కోస్తాం

**ఒంగోలు**

వాలంటరీ వ్యవస్థను కామెంటరీ చేసిన పవన్ నాలుకను వెయ్యి సార్లు కోస్తామని, చీరేస్తామని ప్రకాశం జిల్లా సంతనూతలపాడు వైసీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు హెచ్చరించారు. వాలంటరీ వ్యవస్థకు సంబం ధించి పవన్ మాట్లాడిన మాటలను తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు. పవన్ తైతక్కలాడితే ఆ సినిమాలు చూసి హిట్ చేసిన ఆయన అభిమానులకు కూడా వాలంటరీ వ్యవస్థ ద్వారానే పథకాలు అందచేస్తున్నామని తెలుసుకోవాలన్నారు. వాలంటరీ వ్యవస్థను, సచివాలయాలను వద్దంటున్న పవన్ తిరిగి జన్మభూమి కమిటీలను తీసుకురావాలని కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హాయంలో జరిగిన దోపిడీలపై పవన్ కూడా నిలదీసి ధర్నాలు చేసిన విషయం నిజం కాదా అన్నారు.. గతంలో ఒక్క హామీని కూడా నెరవేర్చని చంద్రబాబు ఆడించిన విధంగా పవన్ ఎందుకు ఆడుతున్నారో సమాధానం చెప్పాల న్నారు. ఎందుకు చంద్రబాబును సీఎంను చేయాలని తపిస్తున్నారో పవన్ స్పష్టం చేయాల న్నారు. కోవిడ్ సమయంలో వాలంటీర్లు చేసిన సేవలు ఏపీ ప్రజలు మరచిపోరన్నారు.. వాలంటీర్లపై ఉమన్ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆరోపణలు చేసిన పవన్ పై పోలీసులు కూడా సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. 18 వేల మంది ఆడపిల్లలు మిస్ అయ్యారని స్టేట్మెంట్ ఇచ్చిన పవన్ వారి వివరాలు చెప్పాలని.. లేకుంటే వాలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని ఆయన ఎమ్మెల్యే సుదాకర్ బాబు డిమాండ్ చేశారు.

# మైనర్ వ్యక్తి వాహనం నడిపి పట్టుబడితే వాహన యజమాని పై కేసు నమోదు చేస్తాం

**జగిత్యాల**

మైనర్ వ్యక్తి వాహనం నడిపి పట్టుబడితే వాహన యజమాని పై తప్పకుండా కేసు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు..గత రెండు రోజులు గా జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాస్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్,విత్ ఔట్ నెంబర్ ప్లేట్, ట్రిపుల్ రైడింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వివిధ ప్రాంతాల్లో పటుబడ్డ 40 మంది వాహనదారులకు సోమవారం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లోని కౌన్సిలింగ్ సెంటర్ లో వారి కుటుంబ సభ్యులను పిలిపించి వారి సమక్షంలో జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం రోడ్డు పైకి వస్తుందని, యజమాని లేని కుటుంబం చిన్నాభిన్నం అయిపోతుందని, ఎట్టి పరిస్థితుల్లో కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని అన్నారు.వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి వాహనాలు నడపాలని అన్నారు. మైనర్ వ్యక్తి వాహనం నడిపి పట్టుబడితే వాహన యజమాని పై కేసు నమోదు చేస్తాం. జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచడం జరిగినదని వాహన యజమానులు మైనర్ వ్యక్తికి వాహనం ఇవ్వకూడదని, వాహనం ఇచ్చినచో వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దానితో వారికి ఎదుటి వ్యక్తులకు ప్రమాదం జరగటం వల్ల రెండు కుటుంబాలు నష్ట పోతున్నాయని కావున మైనర్ లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్ కు వాహనం ఇచ్చి ఏదైనా ప్రమాదం జరిగిన లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తూ వాహనం తో పట్టుబడిన వాహన యజమాని పై కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ నంబర్ లేకుండా వాహనం నడిపిన, నంబర్ ప్లేట్ దాచినా లేదా కొన్ని నంబర్లు తొలగించినా ఇకపై కేసులు నమోదు.నిబంధనలకు విరుద్ధంగా , ఇష్టారీతిన వాహన నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేయడం కొందరు వాహనదారులు ట్రాఫిక్ ఈ చలాన్ నుంచి తప్పించుకోవడం కోసం వాహనాలపై ఫ్యాన్సీ నంబర్ తో పాటు తప్పుడు నంబర్ లు సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా నంబర్ ప్లేట్లపై వివిధ ఆకారాలు, డిజైన్లు, పదాలు, అక్ష రాలు గుర్తించలేనంతగా ఉంటున్నాయి. కొందరు కావాలనే వాటిని తొలగించడం, నంబర్ గుర్తించకుండా నెంబర్ ప్లేట్ విరగ్గొట్టడం చేస్తున్నారు. ఇలాంటి వారు వాహన తనిఖీల్లో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కావున జిల్లా పరిదిలోని ప్రజలు అందరు పోలీస్ వారికీ సహకరించి తమ వాహనాల నెంబర్ ప్లేట్స్ నిబందనల ప్రకారం బిగించు కోవాలని, లేని పక్షం లో వాహనాలపై నంబర్ లేకుండా, నిబందనలకు విరుద్దంగా నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసి వాహనం నడిపితే వాహనదారుడిపై ఛీటింగ్ కేసులను నమోదు చేయబడుతాయని సూచించారు .ఈ మధ్యకాలంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఉపయోగించి చైన్ స్నాచింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న దృష్ట్యా ఈ యొక్క తనిఖీలు నిరంతర నిర్వహించడం జరుగుతుందని కావున జిల్లా పరిదిలోని ప్రజలు అందరు పోలీస్ వారికీ సహకరించలని కోరారు. ఈ సందర్భంగా మద్యం సేవించిన వారితో ఈరోజు నుండి మద్యం సేవించి వాహనాలు నడపమని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ వాహనము నుడుపునపుడు హెల్మెట్ తప్పకుండా దరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కౌన్సెలింగ్ వచ్చిన వారిని విడతలవారీగా కోర్టుకు పంపించడం జరుగుతుందని తెలిపినారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తూ రెండోసారి పట్టుబడితే వారికి జైలు శిక్ష తప్పదని అన్నారు.ఈ సందర్భంగా ఓవర్ స్పీడ్/ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం/ రాంగ్ సైడ్ డ్రైవింగ్/సెల్ ఫోన్ డ్రైవింగ్/ మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగిన ప్రమాదాల గురించి ఆడియో, వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీంద్ర కుమార్, రవీంద్ర రెడ్డి, ఆర్ఐ నవీన్, ట్రాఫిక్ ఎస్.ఐ రాంచంద్రం, డీఆర్ఎస్బీ ఆర్ ఎస్ఐ కృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.




# తాసిల్దార్ కార్యాలయం ఎదుట జీడి రైతులు వినూత్న నిరసన

**శ్రీకాకుళం**

పలాస తాసిల్దార్ కార్యాలయం ఎదుట వర్షంలో జీడి రైతుకు న్యాయం చేయాలని వామపక్ష నాయకులు జీడి పిక్కల బస్తా కాలుస్తూ వినూత్న నిరసన తెలిపారు. రైతుల పండించే 80 కిలోల బస్తా పిక్కలు ధర రూ. 16 వేలు కల్పించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దళారు వ్యవస్థకు వైసీపీ ప్రభుత్వం కొమ్ముకాయ వద్దని, రైతులకు ఆత్మహత్యల వైపు ఉసుగొలపవద్దని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పలువురు వామపక్ష నాయకులు మాట్లాడుతూ తక్షణమే వైసిపి ప్రభుత్వం కలుగజేసుకొని జీడి రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కేరళ, గోవా తదితర రాష్ట్రాల మాదిరిగా జీడి రైతులకు బోర్డు నెలకొల్పి రైతులకు ఆదుకోవాలని కోరారు. జీడి పంటకు జాతీయ పంటల జాబితాలో చోటు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు వంకల మాధవరావు, చాపర వేణుగోపాల్, చాపర వెంకటరమణ, తామాడ సింహాచలం, సిఐటియు గణపతి, మద్దిల రామారావు, కామేశ్వరరావు, జీడి రైతులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆత్మహత్యాయత్నం

**రామచంద్రాపురం**

రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరు శివాజీ ఆత్మహత్యాయత్నం చేసారు. చికిత్స కోసం శివాజీని రామచంద్రపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల్సమక్షంలో రామచంద్రపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరు శివాజీపై దాడి జరిగింది. మచ్చుపల్లి లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ నూ మంత్రి వేణు అనుచరులు దాడి చేసారు. అదివారం వెంకటాయపాలెం లో జరిగిన రాజ్యసభ సభ్యుడు బోస్ తనయుడు సూర్య ప్రకాష్ ఏర్పాటు చేసిన సమావేశంలో వైస్ చైర్మన్ శివాజీ పాల్గోన్నారు. దాంతో వేణు వర్గం అగ్రహానికి గురయింది.

## రైతన్న సన్నాహక సమావేశం లో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి

**వరంగల్**

పాలకుర్తి మండల కేంద్రంలోని ముత్తారం రైతు వేదికల వద్ద రైతన్న సన్నాహాగా సమావేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంచినీటి సరఫరాల శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత బి ఆర్ ఎస్ పార్టీ ది అని అన్నారు. రైతుబంధు పథకం, రైతు బిడ్డ కు ఇన్సూరెన్స్, కే సీ ఆర్ రైతుల మేలు కోరే మన ముఖ్యమంత్రి అని ఆయన అన్నారు. సంవత్సరానికి మూడు సార్లు పంటలు పండే విధంగా చేసినా ఘనత బిఅర్ఎస్ పార్టీ దని అన్నారు. రైతే రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుస్కురీ శ్రీనివాస్ రావు, జిల్లా కోఆప్షన్ మెంబర్ యం డి మధర్, ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, పాలకుర్తి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పసూనూరి నవిన్ కూమార్, ఆయా గ్రామాల సర్పంచ్ లు భాస్కర్ రెడ్డి, ఇమ్మడి ప్రకాష్, ఇంద్ర రెడ్డి,బాలు నాయక్, దేవా నాయక్, ఎం పి టి సి లు , రైతులు మరియు మహిళలు ,బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యువజన నాయకులు సోషల్ మిడియా వారియర్స్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## రైతు వేదికలో ఉచిత విద్యుత్ తీర్మాన భేటీ

**ఖమ్మం**

ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉచిత విద్యుత్ తీర్మాన సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం గురించి తెలిసిన వారికి అయితే కరెంట్ ఎన్ని గంటలు ఉండాలని తెలిసుంటుంది. డైలాగులు చెప్పే వారికి ఏం తెలుసుకుందని ఘాటుగా విమర్శించారు. నేను రైతు బిడ్డని వ్యవసాయం చేశానని చెప్పుకునే రేవంత్ రెడ్డిని చూసి ఎద్దులు పారిపోతున్నాయి. వ్యవసాయం గురించి రైతుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అది తెలుసు కాబట్టే సీఎం కేసీఆర్ చెరువులను, ప్రాజెక్టులను ఏర్పాటు చేసి రైతులకు పెట్టుబడిగా రైతుబంధు ఇస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఆర్ఎస్ఎస్ ఎజెండాను రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని, సీఎల్పీ లీడర్ మల్లు భట్టి విక్రమార్క నిజమైన కాంగ్రెస్ ఆ లేదా అని అడుగుతున్నానని అన్నారు. రేవంత్ రెడ్డి అజెండా మోడీ అజెండా చంద్రబాబు అజెండా ఒక్కటేనని దూయబట్టారు. వ్యవసా యాన్ని దండగ నుంచి పండగ చేసిన వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి విద్యుత్ పై మాట్లాడిన మాటలు రేపు కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ మేనిఫెస్టో పెడతారా అని డిమాండ్ చేసారు.

## ‘పల్లెవెలుగు టౌన్ బస్ పాస్”కు శ్రీకారం

**10 కిలోమీటర్ల పరిధికి నెలకు**

**రూ.800**

**5 కిలోమీటర్ల పరిధికి రూ.500గా ధర**

**ఖరారు**

**ఈ నెల 18 నుంచి అందుబాటులోకి**

**రానున్న టౌన్ బస్ పాస్**



**హైదరాబాద్ జూలై 17**

ప్రయాణికుల ఆర్థిక భారం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా “పల్లెవెలుగు టౌన్ బస్ పాస్”కు శ్రీకారం చుట్టింది. మొదటగా కరీంనగర్, మహబూబ్ నగర్, నిజామాబాద్, నల్లగొండ జిల్లా కేంద్రాల్లో తిరిగే పల్లె వెలుగు బస్సుల్లో ఈ పాస్‌ను అమలు చేయాలని సంస్థ నిర్ణయించింది. ఈ టౌన్ పాస్‌తో ప్రయాణికులు కరీంనగర్, మహబూబ్ నగర్‌లో 10 కిలో మీటర్లు, నిజామాబాద్, నల్లగొండలో 5 కిలోమీటర్ల పరిధిలో అపరిమిత ప్రయాణం చేయొచ్చు. 10 కిలోమీటర్ల పరిధికి నెలకు రూ.800, ఇక 5 కిలోమీటర్ల పరిధికి రూ.500గా “పల్లె వెలుగు టౌన్ బస్ పాస్” ధరను సంస్థ ఖరారు చేసింది. ఇప్పటికే హైదరాబాద్, వరంగల్‌లో జనరల్ బస్ పాస్ అందుబాటులో ఉంది. ఆ బస్ పాస్‌ను జిల్లా కేంద్రాల్లోనూ అమలు చేయాలని ప్రయాణికుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు కొత్తగా “పల్లెవెలుగు టౌన్ బస్ పాస్”ను సంస్థ తెచ్చింది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం “పల్లె వెలుగు టౌన్ బస్ పాస్” పోస్టర్లను సంస్థ ఉన్నతాధికారులతో కలిసి టీఎస్ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ కొత్త టౌన్ పాస్ ఈ నెల 18 (మంగళవారం) నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.

## 29, 30 తేదీల్లో విద్యాసంస్థలకు సర్కార్ సెలవులు

**హైదరాబాద్, జూలై 17:**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు విద్యాసంస్థలకు సర్కార్ రెండు రోజులు వరుసగా సెలవులు ప్రకటించింది. ఈ మేరకు ముందస్తు సమాచారం ఇస్తూ విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్ని పాఠశాలలు, కళాశాలలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్షల నేపథ్యంలో ఈ రెండు రోజుల సెలవులు ప్రకటించింది. రాష్ట్రంలో ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసిన విద్యాసంస్థలకు ఆ రెండు రోజుల్లో సర్కార్ సెలవులు ప్రకటించింది.దాదాపు 5.5 లక్షల మంది అభ్యర్థులు గ్రూప్ 2 పరీక్షలకు హాజరవుతున్నారు. వీరందరికీ ఆఫ్‌లైన్ విదానంలో పరీక్షలు నిర్వహించాలని కమిషన్ నిర్ణయం చింది. ఐతే ఆయా తేదీల్లో పరీక్ష కేంద్రాలుగా ఉన్న విద్యాసంస్థలు ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నత విద్యామండలి, కళాశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు, పాఠశాల విద్యాశాఖ అధికారులకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశించారు.

## పిల్లలు పుట్టడం లేదని ఆత్మహత్య

**హైదరాబాద్, జూలై 17 :**

పిల్లలు పుట్టలేదని దంపతుల ఆత్మహత్యా యత్నం చేసి.. గత ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడి నేడు ఇద్దరు మృతి చెందారు. వివాహమై 5 సంవత్సరాలు గడుస్తున్నా పిల్లలు పుట్టడం లేదన్న మనస్థాపంతో గడ్డి మందు తాగి దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లాలో చోటు చేసుకుంది..దంపతులు ఇద్దరు 6 రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో నర్సాపూర్ మండలం హైమద్ నగర్ గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నీరుడి లక్ష్మణ్ (31), రాణి (24) ఇద్దరికి పెళ్లి జరిగి ఐదు సంవత్సరాలు అవుతుంది కానీ ఇప్పటికీ పిల్లలు కాలేదు అనే బాధ వారిని తీవ్రంగా కలిచివేసింది.. ఆరు రోజుల క్రితం ఇంట్లోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు?దీంతో కుటుంబ సభ్యులు ముందుగా హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం వేరే ఆసుపత్రికి తరలించారు..ఇలా ఆరు రోజులు చికిత్స పొందుతూ, నిన్న రాత్రి 11 గంటలకు భర్త లక్ష్మణ్ మృతిచెందగా..నేడు తెల్లవారు జామున ఆరు గంటలకు భార్య రాణి మృతి చెందింది..లక్ష్మణ్ గత కొన్ని సంవత్సరాలుగా బొంతపల్లి లోని డ్రగ్స్ కంపెనీలో ప్రైవేట్ ఎంప్లాయ్ గా పని చేస్తున్నాడు..ఇలా ఇద్దరు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది..మరో వైపు దీని పై పోలిసులు కేస్ నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

## సీజనల్ వ్యాధులు,వాతావరణ మార్పులపై అవగాహన

**మద్దికేర:**



సీజనల్ వ్యాధులు మరియు వాతావరణ మార్పులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నగేష్ సూచించారు. సోమవారం రోజున స్థానిక హరిజనవాడ లోని సుంకులమ్మ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానం సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా స్థానిక ప్రజలకు సీజనల్ వ్యాధులైన మలేరియా,డెంగ్యూ,చికెన్ గున్యా,అతిసారా మరియు వాతావరణ మార్పులు మరియు వాటి పరిణామాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా మాట్లాడుతూ ప్రజలు భోజనం ముందు,మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుకోవాలని,నీళ్ళు వేడి చేసి చల్లార్చి తాగాలని,వేడి ఆహారం తీసుకోవాలని, దోమతెరలు వాడాలని,దోమకాటు ప్రమాద కరమని,ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,నీటి కుంటలను శుభ్రపరచుకోవాలని,తాగిపడేసిన కొబ్బరి బొండాలు,పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని,మురుగునీటి డ్రైనేజీలలో పూడిక లేకుండా చూసుకోవాలని,ఆహార పదార్థాలపై మూతలు మూయడం ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారించవచ్చని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు,పబ్లిక్ హెల్త్ అసిస్టెంట్ సరస్వతి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమ్మ,సూర్య నారాయణ,ప్రకాష్ రావు మరియు సచివాలయం హెల్త్ సెక్రటరీలు లక్ష్మి,ఆశా మరియు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ పై కేటీఆర్ వ్యాఖ్యలు అర్ధరహితం

**ఖమ్మం**

కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యాలు అర్ధరహితమని టీపీసీసీ ప్రచార కమిటీ కో ఛైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ పై విమర్శలు చేసే స్థాయి కేటీఆర్ కు లేదు. రాహుల్ గాంధీ నీ అనేముందు .. కేటీఆర్ కు వ్యవసాయం గురించి ఏం తెలుసో చెప్పాలని అన్నారు.

ఒక వేలు రాహుల్ గాంధీ వైపు చూపిస్తే .. నాలుగు వెళ్ళు మీ వైపు చూపుతున్నాయని తెలుసుకోవాలి. కేటీఆర్ రాహుల్ గాంధీ పై విమర్శలు హాస్యాస్పదంగా ఉన్నాయి. రాహుల్ గాందీ కి అపారమైన విషయ పరిజ్ఞానం ఉంది. భారత్ జోడో పాదయాత్రలో దేశంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. మీ ఫామ్ హౌస్ లో క్యాప్సికమ్ పంటకు కోట్లు సంపాదించా మని చెప్పిన మీరు, మరి రాష్ట్రంలో రైతులకు ఆ ఫార్ములా ఏంటి ఎందుకు చెప్పలేదు. రాహుల్ పై విమర్శలు చేసే కేటీఆర్ ఏనాడైనా పాదయాత్ర చేశాడా. మీకు అధికారం .. మంత్రి పదవి సోనియా గాంధీ పెట్టిన భిక్ష. కేసీఆర్ ఓ మాయల మరాఠీ. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ కే పేటెంట్ హక్కు ఉంది. విద్యుత్ పై బీ ఆర్ ఎస్ మాటలను ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు.

వైఎస్ హయాంలో ఉచిత విద్యుత్ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ కు ఉంది. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను వక్రీకరించి పబ్బం గడుపుకోవాలని కేటీఆర్ చూస్తున్నారు. నాకు ప్రచార కమిటీ కో చైర్మన్ పదవి ఇచ్చినందుకు అధిష్టానం కు రాష్ట్ర పీసీసీ,సిఎల్పీ సహా ముఖ్య నేతలకు ధన్యవాదాలు. పార్టీలో అందరినీ కలుపుకొని పనిచేస్తా. సీనియర్ల సలహా లు సూచనలతో ముందుకు వెళతా. పార్టీ ఏ గీత గీస్తే దాన్ని శిరసావహిస్తానని అన్నారు.

## కరెన్సీ పై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

**హైదరాబాద్ జూలై 17**



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేస్తూ జులై 26 చలో ఢిల్లీ పోస్టర్ రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లేకుంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేనేలేదు 1921 లో ఇంపీరియల్ బ్యాంకు కుప్ప కూలినప్పుడు రూపాయి దాని సమస్య పరిష్కార మార్గం అనే పుస్తకాన్ని వ్రాసి హిల్టాన్ యంగ్ కమిషన్, రాయల్ కమిషన్, సైమన్ కమిషన్, బ్రిటిష్ ప్రభుత్వానికి ఇవ్వడం వల్ల 1935 ఏప్రిల్ ఒకటిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడింది అంటే దానికి కారణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఈ అంశంపై రాజ్యసభ సభ్యులను పార్లమెంటు సభ్యులను కూడగట్టి పార్లమెంట్లో కొట్లాడుతానని అన్నారు. కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి పాలన చేస్తున్న ప్రజా ప్రతినిధులారా పార్లమెంటులో ఈ అంశంపై మాట్లాడకపోతే ప్రజా ప్రతినిధులపై ప్రజాపూరు తప్పదని హెచ్చరించారు జులై 26న ఢిల్లీ వెళ్దాం రండి కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో ముద్రించేంతవరకు యుద్ధం చేద్దాం రండి ఢిల్లీలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ యొక్క కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ శ్రీ కృష్ణ కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ కొల్లి నాగేశ్వరరావు జాతీయ ఉపాధ్యక్షులు బొల్లి స్వామి ఎరుకల మహేందర్ గౌడ్ ఇడపాక సురేష్ నర్రా ప్రవీణ్ కోడిదల నరేష్ జేరిపోతుల ప్రశాంత్ ఘనపురం అశోక్ తదితరులు పాల్గొన్నారు

## రూ. 20లకు కూరలు

**ఖమ్మం, జూలై 17**

రోజురోజుకి కూరగాయలు ధరలు మండిపోతున్నాయి. సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు కొనలేని పరిస్థితి నెలకొంది. టమాటా, పచ్చిమిర్చినే కాదు.. వంకాయ, కాకరకాయ, బెండకాయ, దొండకాయ, సొరకాయ వంటి కూరగాయలు కేజీ 60 రూపాయలపైనే ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో కూరగాయల వ్యాపారి ఎస్ కే గౌస్.. ఔదార్యం చాటుతున్నాడు.టమాటా, పచ్చిమిర్చి మినహా మిగిలిన కూరగాయలు కేజీ 20 రూపాయలకే అమ్మకాలు చేస్తున్నాడు. ఇల్లందులో బెండకాయ, వంకాయ, కాకరకాయ, దొండకాయ మార్కెట్‌లో కేజీ 60 రూపాయలు దాటింది. ఈ నేపథ్యంలో పేద, సామాన్య ప్రజలకు భారం లేకుండా టమాటా, పచ్చిమిర్చి మినహా.. మిగిలిన కూరగాయలు కేజీ 20 రూపాయలకే అమ్ముతున్నాడు. ఇదే అదునుగా వినియోగ దారులు ఎగబడి కూరగాయలు కొంటున్నారు.ప్రస్తుత పరిస్థితులలో కూరగాయల రేట్లు అధికంగా ఉండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని కొనుగోలు చేసే పరిస్థితిలో లేని నిరుపేదలకు ఉపయోగపడుతుంది కదా అనే ఆలోచనతో కూరగాయలు రేట్లు తగ్గే వరకు.. వాటి మీద ఎటువంటి లాభం లేకుండా అమ్మకాలు చేస్తున్నానని గౌస్ అంటున్నారు. ప్రజలు ఇబ్బంది లేకుండా. తక్కువ ధరకే కూరగాయలు అమ్ముతున్న గౌస్ ఔదార్యాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల**

ధరణి కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆన్నారు..ధరణి పోర్టల్ వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ల సంబంధిత సమస్యలపై విధులు నిర్వహించడానికి నియమించిన కంప్యూటర్ ఆపరేటర్లు తమ సమస్యను పరిష్కరించాలని సోమవారం జగిత్యాల ధరణి టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలసి ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతి పత్రాన్ని పూర్తిగా చదివి ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంఘం జగిత్యాల అధ్యక్షులు చీటి అభిలాష్ రావు, ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నగనూరి హరీష్ ,కార్యవర్గ సభ్యులు, కంప్యూటర్ఆపరేటర్లు పాల్గొన్నారు.

## కేసీఆర్ కుటుంబం పై ఉచ్చు బిగిస్తున్నాం

**జగిత్యాల జూలై 17**



నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం పై ఉచ్చు బిగిస్తున్నామని తెలిపారు. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీనే ఈ మాట చెప్పాక మేము బీఆర్ఎస్‌కు బీ టీమ్ ఎలా అవుతామని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆరెస్‌లోకి వెళ్లకుండా గ్యారంటీ ఇస్తారా? అని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఒక్కరు కూడా బీఆర్ఎస్‌లో చేరరని ఆయన స్పష్టం చేశారు. 2014, 18లో మూడో వంతు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆరెస్‌లో చేరలేదా? అని నిలదీశారు. జైలుకు బావతో వెళ్లాలని అక్క (కవిత కోరుకుంటున్నట్లు ఉందన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు మార్పు అధిష్టానం నిర్ణయమని చెప్పారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు కంటే తాను ఎక్కువే సాధించానని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు.

## పొంగులేటికి నా పూర్తి మద్దతు

**హైదరాబాద్**



పార్టీలో అందరితో కలిసి పనిచేయాలనే ఆలోచనతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారుని కాంగ్రెస్ నేత వి హనుమంతరావు అన్నారు. ఆయనకు ప్రచార కమిటీ కో చైర్మన్ పదవి ఇవ్వడం సంతోషం.

కేసీఆర్ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను మరిచారు. అందుకే పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేసీఆర్ ను విడిచి కాంగ్రెస్ లో చేరారు. పార్టీలో నా పూర్తి మద్దతు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి ఉంటుంది. రాష్ట్రంలో మార్పు ఖాయం. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లతామని అన్నారు.

## కేసీఆర్ పై పోలీసులకు ఫిర్యాదు

**ఖమ్మం, జూలై 17**

ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారంటూ సీఎం కేసీఆర్ పై ఎమ్మెల్యే పొదెం వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. భద్రాచలం పోలీస్ స్టేషన్ కు వెళ్లిన ఆయన.. రాష్ట్ర ముఖ్యమంత్రి పైనే ఫిర్యాదు చేయడం గమనార్హం. గతేడాది జులై 17వ తేదీన సీఎం కేసీఆర్ భద్రాచలంలో పర్యటించారు. గోదావరి వరద గండం నుంచి నియోజక వర్గ ప్రజలను గట్టెక్కించేందుకు భద్రాచలం వద్ద వెయ్యి కోట్లతో కరకట్ట నిర్మాణం చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. లోతట్టు కాలనీలు అయినా సుభాష్ నగర్ ముంపు బాధితులకు మరోచోట డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేశారు. అయితే హామీ ఇచ్చి నేటికి ఏడాది గడుస్తున్నా.. హామీ నెరవేర్చకపోవడం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోదెం వీరయ్య కాంగ్రెస్ పార్టీ తరపున భద్రాచలం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.

## విద్యార్తులకు ఫుడ్ పాయిజన్

**వరంగల్**

హన్మకొండ భట్టుపల్లి ఎస్ఆర్ ప్రైమ్ క్యాంపస్ లో ఫుడ్ పాయిజన్ జరిగింది. 40 మంది విద్యార్థులు అస్వస్థతక గురయ్యారు. 10 మందికి క్యాంపస్ లోనే చికిత్స అందించారు. ఆదివారం రాత్రి చికెన్ బిర్యాని తిన్న విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. 30 మందిని ఆసుప్రతికి తరలించారు. ఫాదర్ కొలంబియా ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. 15 మంది కి చికిత్స చేసి డిశ్చార్జ్ చేసారు.

# సైంధవ్' నుంచి గాయత్రిగా సారా పరిచయం




విక్టరీ వెంకటేష్ 75వ ల్యాండ్‌మార్క్ చిత్రంలో 'సైంధవ్'గా తన ఫెరోషియస్ షేడ్స్ ఇప్పటివరకు చూశాము. ఇప్పుడు అతని లోతైన భావోద్వేగాన్ని పరిచయం చేశారు. బేబీ సారా హార్ట్ ఆఫ్ సైంధవ్ అని రివిల్ చేశారు మేకర్స్. పోస్టర్ లో పాప వెంకటేష్ ను కౌగిలించుకోవడం చూడవచ్చు. పోస్టర్ లో వెంకటేష్ గాయాలతో కనిపిస్తున్నారు. సినిమాలో సారా పాత్ర పేరు గాయత్రి.'ఊమె' ఫ్రాంచైజ్ తో వరుసవిజయాలు అందించిన సక్సెస్ ఫుల్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పై వెంకట్ బోయనపల్లి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సైంధవ్ హై-ఆక్టేన్ యాక్షన్ గా రూపొందుతోంది. ఈ చిత్రంలో ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. సారా పాత్ర హార్ట్ అఫ్ సైంధవ్.ఈ చిత్రంతో బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖ్ వికాస్ మాలిక్ క్యారెక్టర్ లో టాలీవుడ్ అరంగేట్రం చేస్తున్నారు. శ్రద్ధా శ్రీనాథ్ మనోజ్ఞ పాత్రలో కథానాయికగా నటిస్తుండగా, డాక్టర్ రేణుగా రుహాని శర్మ, జాస్మిన్ పాత్రలో ఆండ్రియా జెర్మియా కీలక పాత్రలలో నటిస్తున్నారు.

ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఎస్ మణికందన్ కెమెరామెన్ గా, గ్యారీ బిహెచ్ ఎడిటర్ గా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్న ఈ చిత్రానికి కిషోర్ తాళ్లూరు సహ నిర్మాత.పాన్ ఇండియా మూవీ సైంధవ్ అన్ని దక్షిణాది భాషలు, హిందీలో డిసెంబర్ 22న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది.

# వ్యూహం ఇంటెన్స్ పోస్టర్ విడుదల

కుట్రలకి, ఆలోచనలకి మధ్యలో అసమాన్యుడుగా ఎదిగిన నాయకుని కథే 'వ్యూహం'. ఆ నాయకుడే వైయస్.జగన్ ఫస్ట్ ఇంటెన్స్ పోస్టర్ ఆఫ్ 'వ్యూహం'. టెక్నికల్‌గా తమ పోస్టర్లతో కథను చెప్పి ట్రెండ్ చేయగల పోస్టర్ డిజైనర్స్ అనిల్ అండ్ భాను అనే సంగతి అందరికి తెలిసిందే అని సెన్సేషనల్ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తన ట్వీటర్ ద్వారా తెలియచేశారు. వైయస్. జగన్ పాత్రను పోషించిన అజ్మల్ తనపై జరిగిన కుట్రలకి ఎలా స్పందిస్తున్నారో తెలిపే పోస్టర్‌ను వర్మ విడుదల చేశారు. ఎంతో వ్యూహాత్మకంగా 'వ్యూహం' సినిమాని ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా లె రకెక్కిస్తున్న దర్శకుడు ఆర్జీవి ప్రతిభను చూసి ఆశ్యర్యపోతున్నాను అన్నారు చిత్ర నిర్మాత దాసరి కిరణ్‌కుమార్. రామదూత క్రియేషన్స్ పతాకంపై నిర్మితమవుతున్న 'వ్యూహం' సినిమా చిత్రీకరణ దాదాపు 50 శాతం పూర్తయిందని నిర్మాత తెలిపారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అనేక విషయాలను వెల్లడిస్తామన్నారు. ఈ చిత్రంలో వైయస్.భారతీ పాత్రలో మానస నటిస్తున్నారు.




# భోళా శంకర్'లో పవన్ కళ్యాణ్ ని ఇమిటేట్ చేసిన మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి ఇదివరకే తన మెగా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్' లోని ఒక పాట చిత్రీకరణ నుంచి వీడియోను లీక్ చేశారు. ప్రధాన తారాగణంతో కూడిన జామ్ జామ్ జజ్జనక అనే పాట ఇటీవల విడుదలై అద్భుతమైన స్పందనను అందుకుంది. స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

తాజాగా చిరంజీవి మరో వీడియో లీక్ చేశారు. ఈ వీడియో అభిమానులు, ప్రేక్షకులకు బిగ్ సర్ ప్రైజ్ ఇచ్చారు చిరంజీవి. "మా కళ్యాణ్ బాబు తన సినిమాల్లో అప్పుడప్పుడూ నా ప్రస్తావన తీసుకురావడం, నా పాటలకి స్టెప్పులేయడం, నా డైలాగులను ఇమిటేట్ చేసి మిమ్మల్ని ఎంతగానో ఎంటర్ టైనర్ చేస్తుంటారు. అదే విధంగా నేను మిమ్మల్ని ఎంటర్ టైన్ చేయడానికి 'భోళాశంకర్'లో తన పాట, మేనరిజమ్స్ ని ఇమిటేట్ చేయడం జరిగింది" అని చెప్పిన మెగాస్టార్.. 'ఖుషి' సినిమాలో యే మేరా జహా పాట లో పవన్ కళ్యాణ్ డ్యాన్స్ ని అనుకరిస్తున్న చిన్న గ్లింప్స్ ని పంచుకున్నారు. ఈ వీడియోలో యాంకర్ రష్మీ గౌతమ్ కూడా కనిపించారు.అనిల్ సుంకర యొక్క ఎకే ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో తమన్నా భాటియా, కీర్తి సురేష్ , సుశాంత్ ఇతర ప్రధాన తారాగణం.

డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.భోళా శంకర్ ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్, రఘు బాబు, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, సురేఖా వాణి, శ్రీ ముఖి, హైపర్ ఆది, వైవా హర్ష, ప్రదీప్, అనీ, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, వేణు టిల్లు, తాగుబోతు రమేష్, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, వీర్, షావర్ అలీ ఉ తరుణ్ అరోరా

# తుఫానుకు ముందు ఉరిమే మేఘం ఆమె!




- జవాన్ నాయిక నయనతార పోస్టర్ విడుదల చేసిన షారుఖ్
- జవాన్ పోస్టర్ విడుదల! నయనతారను ఇంతకుమునుపెప్పుడూ చూడని పవర్ ప్యాక్డ్ యాక్షన్ అవతార్‌లో చూడటానికి సిద్ధంకండి!

ప్రేక్షకుల్లో రోజురోజుకీ ఘనంగా అంచనాలు క్రియేట్ చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ జవాన్. షారుఖ్‌ఖాన్ హీరోగా నటిస్తున్నారు. నానాటికీ జనాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది జవాన్ మూవీ. జవాన్ నుంచి నెక్స్ట్ ఎలాంటి అప్‌డేట్ వస్తుందా? అని ఆత్రుతతో ఎదురుచూస్తున్న అభిమానుల మనసు తెలుసుకున్న మేకర్స్ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. చూడగానే స్టన్నింగ్‌గా, యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో మెప్పిస్తున్నారు నయనతార. జవాన్ హీరోయిన్ నయనతార లుక్‌కి అందరూ ఫిదా అవుతున్నారు. ప్రివ్యూలో ఆమె లుక్ చూసిన వాళ్లు సినిమాలో మరో రేంజ్‌లో ఉండి తీరుతుందని ఫిక్స్ అయ్యారు. ఈ పోస్టర్ వారి అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా డిజైన్ అయింది. షారుఖ్ ఇచ్చిన ట్రీట్ సూపర్‌డూపర్ అంటున్నారు ఫ్యాన్స్.

సౌత్ ఇండియాలో తలైవిగా, లేడీ సూపర్‌స్టార్‌గా మెప్పించిన నయనతారకు బాలీవుడ్‌లో ఇది తొలి సినిమా. ప్రప్రథమంగా ఆమె ఉత్తరాదిన చేస్తున్న సినిమా కోసం అక్కడివారు కూడా ఎదురుచూస్తున్నారు. మొట్టమొదటి సారి వెండితెరమీద కలిసి నటిస్తున్నారు షారుఖ్ ఖాన్, నయనతార. వారిద్దరి మధ్య ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీని చూడటానికి వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు మూవీగోయర్స్.

జవాన్ ప్రివ్యూలో నయనతారను చూసిన వారు వావ్ అంటున్నారు. హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ఆమె పాత్ర డిజైన్ అయిన తీరుకు ఫిదా అవుతున్నారు. పోస్టర్‌ని చూస్తుంటే నెక్స్ట్ లెవల్ మూవీ రెడీ అవుతోందనే విషయం స్పష్టమవుతోంది. నయనతార ఈ మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. ఆమె కేరక్టర్ సినిమాలో అత్యద్భుతంగా హైలైట్ అవుతుందనే విషయంలో అసలు అనుమానాలేం అక్కర్లేదు. ఇలాంటి ఇంట్రస్టింగ్ విషయాలను వెల్లడిస్తూ ఆడియన్స్‌లో ఎప్పటికప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తున్నారు మేకర్స్. నెక్స్ట్ అప్‌డేట్ ఏం ఇస్తారా? అంటూ ప్రేక్షకులు వెయిట్ చేసేలా క్యూరియాసిటీ స్ట్రాంగ్‌గా క్రియేట్ అయింది. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ రూపొందిస్తున్న సినిమా జవాన్. అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. గౌరీఖాన్ నిర్మాత. గౌరవ్‌వర్మ సహ నిర్మాత. జవాన్ మూవీని ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది సెప్టెంబర్ 7న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హిందీ, తెలుగు, తమిళ్‌లో విడుదల కానుంది జవాన్.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950